



సమావేశంలో మాట్లాడుతున్న లంకా దినకర్

కొప్పర్తి అభివృద్ధికి కసరత్తు!

హడ్కో నుంచి రుణాలు
అన్నమయ్య జిల్లాలో ఎన్‌టిఆర్ నగర్‌కు 30 ఎకరాలు మళ్లింపు
మంత్రివర్గ సమావేశంలో ఆమోదం



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని కొప్పర్తి పారిశ్రామికవాడ అభివృద్ధికి కసరత్తు ఊపందుకోనుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మంత్రివర్గ సమావేశం ఆమోదించింది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం కొప్పర్తి పారి శ్రామిక వాడలోని అధిక భాగాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేయడంపై దృష్టి సారించింది సంగతి తెలిసిందే. ప్రభుత్వం కొప్పర్తిలో మిగిలిన ప్రాంతాన్ని అభివృద్ధి పరచడానికి సంసిద్ధతను తెలిపింది. రాష్ట్రంలోని కడప జిల్లాలోని కొప్పర్తి, కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు, ప్రకాశం జిల్లాలోని పామూరు ప్రాంతాలలోని పారిశ్రామికవాడల అభివృద్ధికి ఏపి స్టేట్ స్పెషల్ ప్రాజెక్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తరఫున హడ్కో నుంచి రూ.ఐదు వేల కోట్లు రుణాన్ని తీసుకోవాలని భావించింది. అన్నమయ్య జిల్లా రాయచోటి మండలంలోని సిబ్యాలకు చెందిన 50 ఎకరాలను పురపాలికశాఖకు మళ్లిస్తూ నిర్ణయం తీసుకుంది. 2215 సర్వేనెంబర్‌లో 13 ఎకరాలు, 2216 సర్వేనెంబర్‌లో 19 ఎకరాలు, 2217 సర్వేనెంబర్‌లో 18 ఎకరాలను ప్రభుత్వ భూములను పిఎంఎవై అర్బన్ 2.0 పథకం కింద (ఎన్‌టిఆర్ నగర్) అమలు చేయడానికి ఉద్దేశించి రెవెన్యూ ల్యాండ్స్ డిపార్ట్‌మెంట్ చేసిన ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. 2029-30 ఆర్థిక సంవ త్సరం వరకు 0.25 కోట్ల మేరకు ఐదు సమాన వాయిదాలలో రూ.1.134 కోట్ల మార్కెట్ విలువ చొప్పున 50 ఎకరాలకు రూ.2.20 లక్షల చొప్పున చెల్లించాలని కోరుతూ ఎపిటిడ్కోతో ఒప్పందం కుదుర్చుకుంది.

పోలీసుల అదుపులో జనార్దన్‌రావు

ప్రజాశక్తి-ములకలచెరువు

నకిలీ మద్యం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ఎ1గా ఉన్న విజయవాడకు చెందిన జనార్దన్‌రావును శుక్రవారం గన్నవరం ఎయిర్‌పోర్టులో ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకు న్నారు. దక్షిణాఫ్రికా నుంచి జనార్దన్ విజయవాడ వస్తున్నారని తెలుసుకున్న పోలీసులు గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకొని అదుపులోకి తీసుకున్నారు. జనార్దన్‌రావు, అతని అనుచరుడు రాజు కలిసి ములకలచెరువు కనుగొండ అర్బి ప్రాంతంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నకిలీ మద్యం తయారు చేస్తున్నట్లు గుర్తించిన పోలీసులు ఇటీవల దాడులు నిర్వహించి రూ.1.75 కోట్ల విలువైన నకిలీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే జనార్దన్ సోదరుడు జగన్మోహన్‌రావును పోలీసులు అరెస్టు చేశారు. ములకలచెరువులో తయారు చేసిన నకిలీ మద్యాన్ని విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన బాట్లింగ్ యూనిట్‌లో ప్రాసెసింగ్ చేసినట్లు గుర్తించారు. ఇబ్రహీంపట్నం ఎఎన్ఆర్ బార్ వద్ద నకిలీ మద్యం తయారీ కేంద్రాన్ని కూడా ప్రారంభించి, విక్రయాలు చేస్తున్నట్లు గుర్తించారు. గోల్డ్ అడ్మిరల్, క్లాసిక్ బ్లూ, కేరళ మాల్ట్, మంజీరా తదితర మద్యం బ్రాండ్ ఒరిజినల్ లేబుళ్లతో నకిలీ మద్యాన్ని వేర కొర్క్ క్వార్టర్ బాటిళ్లలో నింపినట్లు నిర్ధారించారు. ఇవి ఒరిజినల్ బ్రాండ్లు తీసిపోని రీతిలో ఉన్నా యి. మూతలు బిగించే యంత్రాలు, హెూలోగ్రామ్ స్టిక్కర్లు, కార్టన్లను గుర్తించారు. ఇక్కడి నుంచి మద్యం దుకాణాలు, బెల్ట్ షాపులకు తరలించినట్లు దర్యాప్తులో తేలింది. తన సోదరుడు జగన్మోహనరావు సాయంతో జనార్దన్‌రావు ఈ దందా నడిపించినట్టు విచారణలో వెల్లడైంది.

ఆకాంక్షిత జాబితాతో జిల్లాల అభివృద్ధి

- 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్రంలోని అన్నమయ్య, సత్యసాయి, ప్రకాశం జిల్లాలు వెనుకబాటుతనం ఆధారంగా ఆకాంక్షిత జిల్లాలుగా పరిగణించాలని సిఎం చంద్రబాబును కోరినట్లు రాష్ట్ర 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్లో కలెక్టర్ నిశాంత్‌కుమార్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో పాటు కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న ప్రధాన మంత్రి ధన ధాన్య కృషి యోజన కింద జిల్లాలో చేపట్టనున్న వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని నూరు జిల్లాలను ఆకాంక్షిత జిల్లాలుగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ శనివారం ప్రకటించనున్నారని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాను కూడా ఆ జాబితాలో ఉండటం పట్ల ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. అన్నమయ్య జిల్లాలో వ్యవసాయ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. ఈ పథకానికి 2025-26 ఆర్థిక సంవత్సరం నుంచి ఆరేళ్లపాటు ప్రతి ఏటా రూ.24 వేల కోట్లను కేటాయిస్తారన్నారు. ప్రతి రాష్ట్రం నుంచి కనీసం ఒక జిల్లాను ఈ పథకానికి ఎంపిక చేస్తున్నారన్నారు. వ్యవసా యంలో తక్కువ ఉత్పాదకత, క్షీణత వ్యవసాయ పరిస్థితులు, సగటున తక్కువ వ్యవసాయ రుణాలు తీసుకునే పరిస్థితులు ఉండే కనీసం ఒక జిల్లాను ఆకాంక్షిత వ్యవసాయ జిల్లాగా తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వ్యవసాయం ఉత్పాదకత పెంపు, వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా పంటల మార్పు, సాగుకుల వ్యవసాయ పద్ధతులను అనుసరించేలా చేయడం, పంచాయతీ, బ్లాక్ స్థాయిలో పంట కోత అనంతరం పంట నిల్వకు అవసరమైన చర్యలు, నీటి వనరుల లభ్యతను పెంచడం, స్వల్ప, దీర్ఘకాలిక రుణాల లభ్యత అనే 05 లక్ష్యాలతో ఈ పథకం అమలవుతుందన్నారు. కేవలం వ్యవసాయ శాఖ మాత్రమే కాకుండా గ్రామీణ అభివృద్ధి, సహకారం, ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమలు, పశుసంవర్ధక, పాడి, మత్స్య తదితర రంగాలకు నీతి ఆయోగ్ నాబార్డ్ తదితర శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆకాంక్షిత వ్యవసాయ జిల్లాలో రైతుల జీవితాలను మెరుగుపరచడానికి కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. మొత్తం 11 శాఖలకు సంబంధించిన 36 కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు జోడించి 73 సూచికలలో కనీసం 46 సూచికల ఫలితాలను రాబట్టే విధంగా ఈ కార్యక్రమం అమలవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లాకు చోటు లభించడం కోసం ఎంతో కృషి చేశారని, తన అభ్యర్థనను స్పందనగా జిల్లా ఈ పథకంలో భాగస్వామ్యమైందని చెప్పారు. తాను అన్నమయ్య జిల్లాను ఎంచుకోవడానికి కారణాలను వివరిస్తూ ఈ సంవత్సరం జనవరిలో కలెక్టరేట్‌కు వచ్చి వివిధ ప్రభుత్వ పథకాలపై సమీక్ష చేసినప్పుడు జిల్లా దయనీయస్థితి అర్థమైందని తెలిపారు. జిల్లా భౌగోళిక, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఆకాంక్షిత జిల్లాలో చోటు కల్పించేందుకు కృషి చేయాలని నిర్ణయించుకున్నానని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న డబుల్ ఇంజన్ సర్కార్ అన్నమయ్య జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా ప్రజలందరూ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ఎంపిక కావడం సంతోషకరమని, ఈ కార్యక్రమం ద్వారా వ్యవసా యం, పాడి పరిశ్రమ, ఉద్యానవనం, ఇతర అనుబంధ రంగాలు జిల్లాలో అభివృద్ధి చెందు తాయని ఆకాంక్షించారు. సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్, శ్రీశైలం దేవస్థానం చైర్మన్ రమేష్ నాయుడు, డిఆర్ఒ మధుసూదన్ రావు, రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టిలకు అన్యాయం జరగరాదు : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

ఎస్‌సి, ఎస్‌టిలకు ఎక్కడా అన్యాయం జరగరాదని జిల్లాలో సామాజిక రుగ్మతలను సమూలంగా తొలగించడమే లక్ష్యంగా పారదర్శకంగా, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని ఎస్‌పి ధీరజ్ కునుబిల్లితో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీకి సంబంధించిన కేసులలో బాధితులకు న్యాయంతో పాటు త్వరితగతిన కేసులను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒ, డిఎస్‌పిలను ఆదేశించారు. ఎస్‌సి, ఎస్‌టిలకు సంబంధించిన భూ సమస్యలు ఏమైనా ఉంటే వాటిపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నిమ్న వర్గాల ప్రజలపై వివక్ష, అఘాయిత్యాలు జరగకుండా పోలీసు, రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎస్‌సి, ఎస్‌టిల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల అవకాశాలను కల్పిస్తోందని, ప్రతి ఒక్కరూ వినియోగించుకుని అభివృద్ధి చెందే విధంగా అధికారులు కృషి చేయాలని అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి సంబంధించిన జాబితాను ఉమ్మడి జిల్లాలైన కడప, చిత్తూరు నుంఇ రెండు వారాలలో నివేదికలు తెప్పించుకోవాలని ఆదేశించారు. వాల్మీకిపురానికి సంబంధించి ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలు దాదాపు 600 ఉన్నాయని ఎప్పారు. శ్మశాన వాటికలు లేక నిమ్మనపల్లి రోడ్డు లోని బహుదానదిలో ఖననం చేస్తున్నారని చెప్పారు. వర్షాలు పడితే చాలా ఇబ్బందులు గురి కావాల్సి వస్తుందని వీలైనంత త్వరగా శ్మశాన వాటిక స్థలాన్ని కేటాయించాలని డివిఎంసి కమిటీ సభ్యులు కలెక్టర్‌ను కోరారు. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యను పరిష్కరించే విధంగా చూడాలని ఆదేశింఆరు. ప్రతి నియోజకవర్గం, మండలం స్థాయిలో క్రమం తప్పకుండా సివిల్ రైట్స్ డే తప్పకుండా నిర్వహించి, అందుకు సంబంధించిన నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లాస్థాయిలో అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకొని ఒక పెద్ద లైబ్రరీని ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. రాయచోటికి ఒక గొప్ప చరిత్ర ఉందని ఇక్కడ చదివిన వారు ఆల్ ఇండియా సర్వీసెస్‌లో తనకు తెలిసి చాలామంది ఉన్నారని చెప్పారు. ఇలాంటి పెద్ద లైబ్రరీ ద్వారా ఇంకా చాలామంది ఆల్ ఇండియా సర్వీసెస్‌కు ఎంపిక అయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి గ్రామ సచివాలయంలో ఒక లైబ్రరీ ఏర్పాటు అయ్యేలా చూడాలని పేర్కొన్నారు. ఐఐటి, జెఇఇ, మెడికల్, బ్యాంకు, రైల్వే తదితర పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను ఏర్పాటు చేస్తే నిరుద్యోగ యువతీ యువకులకు మంచి తోడ్పాటు ఇవ్వడం జరుగుతుందని తద్వారా జిల్లాలో ఎక్కువ శాతం ఉద్యోగ అవకాశాలు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రస్తుత సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలపై తదుపరి సమావేశం నాటికి పూర్తి స్థాయిలో పరిష్కరించే దిశగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. గత సమావేశంలో చర్చించిన విషయాలపై జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి దామోదర్ రెడ్డి వివరింఆరు. ఆయా శాఖల నుండి హాజరైన అధికారులను జిల్లా కలెక్టర్ సంబంధిత అంశాలపై వివరంగా అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులను ఆదేశించారు. ఎస్‌పి మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీకి సంబంధించిన కేసులకు సంబంధించి ఎక్కడ అన్యాయం జరగకుండా పోలీస్ శాఖ తరపున చర్యలు తీసుకోవడం తీసుకుంటామన్నారు. సైబర్ నేరాల, లోన్ ఫ్రాడ్ యాప్‌ల, గురించి అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తామన్నారు. మన చేతిలోని ఫోన్ పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అవగాహన లోపంతో వివిధ రకాల యాప్‌లను వినియోగించి మోసపోవద్దని తెలియజేశారు. సమావేశంలో మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఒమధుసూదన్ రావు, రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, జిల్లా అటవీ శాఖ అధికారి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి దామోదర్ రెడ్డి, మదనపల్లె, రాజంపేట డివిజన్ల డిఎస్‌పిలు, డిఆర్‌డిఎ పీడీ, వ్యవసాయాధికారి డివిఎంసి కమిటీ సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్ కుమార్, చిత్రంలో ఎస్‌పి ధీరజ్



ఆస్పత్రిలో విచారణ చేస్తున్న మహిళా కమిషన్ సభ్యులు రూకియా బేగం

ప్రత్యేక నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆర్‌ఎస్‌ఎస్ అండతో దేశంలో కుల ఉన్మాదులు పెట్రేగిపోతున్నారని, ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం సృష్టిస్తున్న కుల హింసకు పరాకాష్టే హర్యానాలో సీనియర్ ఐపిఎస్ అధికారి వై.పూరన్ కుమార్ ఆత్మహత్య అని, విడుదలై చిరుతైగల్ కట్చి (విసికె పార్టీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ అన్నారు. కులపరమైన వేధింపులు తాళలేక ఒక సీనియర్ ఐపిఎస్ అధికారి ఆత్మహత్య చేసుకున్నారంటే, దేశంలో కింది స్థాయిలో పనిచేసే ఎస్సీ, ఎస్టీ అధికారులు, సామాన్య ప్రజల పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో ప్రభుత్వం అర్థం చేసుకోవాలని తెలిపారు. మోడీ ఏలుబడిలో ఆర్‌ఎస్‌ఎస్ గుంపుల అరాచకాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని, తత్కారణంగా దేశంలో కుల, మత హింస విపరీతంగా పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సిజెఐపై జరిగిన దాడిపైన, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐపిఎస్ పూరన్ కుమార్ ఆత్మహత్యపైన సిఎం చంద్రబాబు, వైసిపి అధినేత జగన్ స్పందించక పోవడం, రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీలను తీవ్రమైన ఆవేదనకు, అభద్రతకు గురిచేసిందని, వారు వెంటనే స్పందించాలని కోరారు. పూరన్ కుమార్ సూసైడ్ నోట్‌లో ఏముందో బహిర్గతం చేసి, బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశంలో కులహింస పరాకాష్టకు చేరిందని, రాష్ట్రపతి కలుగజేసుకొని, ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులైన ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న వేధింపులను గుర్తించేందుకు ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసి, వాటికి చరమగీతం పాడేందుకు, తగు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఎఆర్ కానిస్టేబుళ్ల సంక్షేమానికి కృషి : ఎస్‌పి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ఎఆర్ కానిస్టేబుళ్ల సంక్షేమానికి కృషి చేస్తామని ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా ప్రధాన కార్యాలయంలోని పరేడ్ మైదానంలో వారం పరేడ్‌లో భాగంగా గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణ సంక్షేమం, వృత్తి నైపుణ్యం అంశాలపై దృష్టి సాధించాలని పోలీస్ శాఖలో అంతర్గత క్రమశిక్షణతో పాటుసిబ్బంది సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు. సిబ్బంది తమ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి యోగా, ధ్యానం, వ్యాయామం చేస్తూ మరింత ఉత్సహంతో విధులు సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకోరావాలని కోరారు. ముఖ్యంగా ఎస్కార్ట్ విధులు నిర్వహించేవారు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి యం.వెంకటాద్రి, ఆర్‌ఐ పెద్దయ్య, ఆర్‌ఎస్‌ఐ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్‌పి ధీరజ్

బాలిక ఉదంతంపై మహిళా కమిషన్ విచారణ

ప్రజాశక్తి-పీలేరు

కెవి పల్లె మండలం, జిల్లెల్ల మంద పంచాయతీలో తల్లైన బాలిక ఉదంతంలో అనూహ్య పరిణామాలెన్నో చోటు చేసుకున్నాయి. ఈ సంఘటనపై శుక్రవారం రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులు డాక్టర్ రుకియా బేగం జోక్యం చేసుకుని, కాన్పు జరిగిన అనుపత్రిలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా బాలికకు తాము కాన్పు చేయడం వాస్తవమేనని, ఆ అనుపత్రి వైద్యురాలు అంగీకరించారు. తాము బాలిక పురుడు పోసుకున్న మగబిడ్డను ఇతరులకు ఇవ్వలేదని, బిడ్డను తల్లితో ఉన్న సహాయకులకు అప్పగించామని వైద్యురాలు చెప్పడం, లేదు తాము బిడ్డను ఆసుపత్రిలోనే అప్పగించి బాలికను మాత్రమే ఇంటికి తీసుకెళ్లామని బాధితురాలి సమీప బంధువులు ఐసిడిఎస్, పోలీసులకు చెప్పడంతో గందరగోళం నెలకొంది. మహిళా కమిషన్ సభ్యులు, ఐసిడిఎస్, పోలీసుల జోక్యంతో ఆ బిడ్డ శుక్రవారం సాయంత్రం తిరిగి అదే ఆసుపత్రిలో ప్రత్యక్షమయ్యాడు. బిడ్డను ఐసిడిఎస్ అధికారులు తమ సంరక్షణలోకి తీసుకున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తించి మైనర్ బాలికకు కాన్పు చేయడమే కాకుండా బిడ్డను ఇతరులకు అప్పగించి, ఆ విషయం దాచి పెట్టడంతో భగ్గుమన్న విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు ఆసుపత్రి నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి ముందే నిరసన వ్యక్తం చేశారు.

జిఎస్‌టిని సద్వినియోగం చేసుకోండి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అందించే జిఎస్‌టి తగ్గింపును వినియోగించు కోవాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని సాయి శుభ ఫంక్షన్ హాల్‌లో జిల్లా వాణిజ్య పన్నులశాఖ, పరిశ్రమల శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ వస్తు వులకు జిఎస్‌టి తగ్గింపును సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిఎస్‌టి తగ్గింపు వల్ల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని, తెలిపారు. ప్రభుత్వాలకు ఆర్థికంగా నష్టమైనప్పటికీ ప్రజల సంక్షేమం దృష్ట్యా జిఎస్‌టి తగ్గింపు అమలు చేస్తున్నాయని పేర్కొన్నారు.ఎలక్ట్రానిక్ వస్తువులైన ఫ్రిడ్జ్, మైక్రోవేవ్ ఓవెన్, టివిలు, వాషింగ్ మెషిన్లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులు తక్కువ ధరకే ప్రజలకు అందుబాటులో ఉంటాయని తెలి పారు. ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకో లని సూచించారు. కార్యక్రమంలో రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు, పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణకు చర్యలు

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో మాదకద్రవ్యాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్లో మాదకద్రవ్యాల జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని ఎస్‌పి ధీరజ్ కునుబిల్లితో కలసి కలెక్టర్ నిశాంత్ కుమార్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా వాటి వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మాదకద్రవ్యాల నివారణ రవాణాను అరికట్టేందుకు ప్రణాళిక బద్ధంగా సమన్వయంతో పని చేయాలన్నారు. ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి మాట్లాడుతూ యాంటీ డ్రగ్స్‌పై జిల్లాలో ఇప్పటివరకు 2110 గాను గ్రామాలలో 1550, కళాశాలలు,ఉన్నత పాఠశాలలో 560, డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమాన్ని జిల్లా మొత్తం 205కు గాను గ్రామాలలో 55, పాఠశాలలు, కళాశాలల్లో 150 అవగాహన కార్యక్రమాలను చేపట్టామని ఎస్‌పి చెప్పారు. ఈఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు జిల్లా మొత్తంలో ఎనిమిది గంజాయి కేసులు నమోదయ్యాయని వివరించారు. సమావేశంలో మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఒ మసూదన్ రావు, రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, జిల్లా అటవీ శాఖ అధికారి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు, డిఎస్‌పి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మహిళలు మనోధైర్యంతో ముందడుగు వేయాలి

ప్రజాశక్తి- రాయచోటి

మహిళలు ప్రతి చిన్న విషయానికి నిరుత్సాహపడకుండా, జీవన పోరాటంలో మనోధైర్యంతో ముందడుగు వేయాలని జిల్లా మహిళా సోషల్ కౌన్సిలర్ ఫిమా అంజుమ్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రీషిర్డీ సాయి మహిళా డిగ్రీ కళాశాలలో మహిళా సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల పట్ల జరిగే అన్యాయాలు, అక్రమాలను ఏ విధంగా ధైర్యంగా ఎదురుకోవాలి, మహిళా సాధికార ఎలా సాధించాలి అని అంశాలపై వివరించారు. ముఖ్య పోష్ యాక్ట్ 2013 - లైంగిక వేధింపులు పని ప్రదేశంలో ఎదురు కున్నప్పుడు వాటిని ఎలా ఎదుర్కోవాలి, వాటిని చాకచక్యంగా ఎలా పరిష్కరించుకోవాలి అనే సూచనలను తెలియజేశారు. విక్టిమ్ కంపెన్సేషన్ ఎలా వాడుకోవాలి, ఎవరికీ వర్తిస్తుంది వాటి వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలియజేశారు. పెళ్ళి తర్వాత మానసికంగా, శారీరకంగా ఎదుర్కొనే సమస్యలను ఎలా పరిష్కారం చేసుకోవాలో వివరించారు. మొబైల్ ఉపయోగాలు వాటిని ఎలా టెక్నాలజీ పరంగా వాడుకోవాలి, కేరీర్ పట్ల ఫోకెస్ పెంచుకొని ఉన్నత చదువులకు నాంది పలకాలి, మహిళ సాధికారిత అంటే తన సొంత నిర్ణయాలను తను ధైర్యంగా ఎంచుకొని ముందుకి నడవడం అని వెల్లడించారు. మహిళల జీవనోపాధి కోసం విస్తృత అవకాశాలు ఉన్నాయని వాటిని చాకచక్యంగా ఓడిసి పట్టుకొని ఉన్నత స్థితికి ఎదగాలని సూచించారు. తగిన వసతులను ఏర్పాటు చేసిన షిర్డి సాయి మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపక బృందానికి, సిబ్బందికి, కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ బసమ్మ పాల్గొన్నారు.

సినీరంగంలో ఆణిముత్యం అలీ

- మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

తెలుగు సినీ రంగంలో ఆణిముత్యం నటుడు అలీ అని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని కొత్తపేటవీధిలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాయి నారాయణ సేవ కేంద్రంలో నటుడు అలీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ నటుడు అలీ బాల్యం నుంచే సినీరంగంలో హాస్యాన్ని పండిస్తూ తనదైన ముద్ర వేసుకున్నారని, ఇప్పటివరకు 1265 సినిమాల్లో నటించి రికార్డును సృష్టించారని కొనియాడారు. తెలుగు, తమిళం, కన్నడ, హింది చిత్రాలలో నటించి సినీ జగత్తులో లక్షలాదిమంది ప్రేక్షకుల అభిమానాన్ని చూరుగొన్న నటుడు అలీ అన్నారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, సర్పంచ్‌లు హబీబ్‌బాష, సురేష్ కుమార్ రెడ్డి, రెడ్డప్పరెడ్డి, వైసిపి మండల అధ్యక్షుడు శివారెడ్డి, నాయకులు మహబూబ్ బాషా, రామకృష్ణారెడ్డి, కుమార్, ఆబీద్, పరమేష్, ఖాదర్ బాషా, సమీ, జాకీర్, రఘు, సత్య పాల్గొన్నారు.



కేక్‌కట్ చేస్తున్న చింతల, పీలేరు సర్పంచ్ హబీబ్‌బాషా

అధ్యాపకులు జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాల లో ఐదు రోజులపాటు ఎక్స్ప్లోరింగ్ ద ఫౌండేషన్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్ అండ్ ఇంటె లిజెంట్ సిస్టమ్స్ త్రుమిషన్ లెర్నింగ్' అంశంపై కొనసాగిన ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం శుక్రవారం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమం యూనివర్సిటీ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి సుమారు 38 మంది అధ్యాపకులు హాజరయ్యారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫ్యాకల్టీ డెవల ప్మెంట్ సెంటర్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రశాంతి హాజరై ఫ్యాకల్టీ అభివృద్ధి ప్రాముఖ్యతపై విలువైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యా రంగం వేగంగా మారు తున్న ఈ కాలంలో అధ్యాపకులు నిరంతరంగా తమ జ్ఞానాన్ని అప్‌డేట్ చేసుకోవడం అత్యవ సరమన్నారు. ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్ ద్వారా ఉపాధ్యాయులు కొత్త పద్ధతులు, పరిశోధనా దృక్కోణం, ఇన్నోవేషన్‌పై అవగాహన పెంపొం దించుకోవాలని చెప్పారు. డాక్టర్ విశ్వనాథరాజు మాట్లాడుతూ ఫ్యాకల్టీ నైపుణ్యాభివృద్ధి ద్వారా మాత్రమే అకడమిక్ ఎక్సలెన్స్ సాధ్యం అవుతుం దన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రోగ్రా మ్స్‌ను మరింత విస్తృతంగా నిర్వహించడానికి కళాశాల సంకల్పించిందని తెలిపారు. కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి మాట్లా డుతూ అధ్యాపకులు సాంకేతికతను బోధనలో సమర్థవంతంగా వినియోగించే మార్గాలను నేర్చు కున్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల నైపు ణ్యాభివృద్ధి విద్యా నాణ్యతను పెంచడమే కాకుండా, విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రేరేపించడానికి దోహదం చేస్తుందని అన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి. వెంకట రమణ మాట్లాడుతూ ఐదు రోజుల శిక్షణలో ప్రతి సెషన్ బోధనా నైపుణ్యాల విస్తరణ, పరిశోధన దృక్కోణం, ఆధునిక సాంకేతికతల అన్వయం వంటి అంశాలపై కేంద్రీ కృతమైందిన్నారు. యూనివర్సిటీ సహకారంతో ఇలాంటి ప్రోగ్రామ్స్‌ను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని పేర్కొన్నారు. ముగింపు సెషన్‌లో పాల్గొన్న అధ్యాపకులు తమ అనుభవాలను పంచుకుంటూ తమ బోధనా విధానాల్లో నూతన దృక్కోణాన్ని తీసుకువచ్చిందని, ఈ ప్రోగ్రామ్ ద్వారా సాధించిన జ్ఞానం విద్యార్థులకు మరింత నాణ్యమైన బోధన అందించడానికి ఉపకరిస్తుందని పేర్కొన్నారు. డాక్టర్ ఎ.నరేష్ మాట్లాడుతూ కార్యక్రమం విజయవంతంగా పూర్తి కావడంలో సహకరించిన యాజమాన్యం, వనరుల వ్యక్తులు, యూనివర్సిటీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



ప్రొఫెసర్ డాక్టర్ ప్రశాంతితో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు



మాట్లాడుతున్న హెచ్‌ఎం అమృనాయక్

ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-చిన్నమండెం

హెచ్ఐవి, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంఇఒ రవినాయక్, ప్రధానోపాధ్యాయులు అమృనాయక్ పేర్కొన్నారు. మండల పరిధిలోని రాయవరం జడ్‌పి హైస్కూల్‌లో విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ఐవికి మందు లేదని నివారణ ఒక్కటే మార్గమని తెలిపారు. హెచ్ఐవి ఎలా సోకుతుందో విద్యార్థులకు వివరించి చెప్పారు. ఈ వ్యాధి పట్ల విద్యార్థుల అవగాహన కలిగి ఉండటంతో చాల ముఖ్యమని తెలిపారు. అనైతి లైంగిక సంబంధాలు, ఎయిడ్స్‌వ్యాధి గ్రస్తులు వాడిన సిరంజిలు ద్వారా వ్యాపిస్తుందన్నారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఇష్టంతో కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాని ఆకాంక్షిచారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపకుండా ప్రేమను పంచాలని, దరి చేరదీసి దైర్యం చెప్పి జీవితంపై ఆసక్తి పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజా చైతన్య స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు జె.సుహాసిని, డి.రమణమ్మ, జయరామ్‌రాజు, మాస్టర్ నాగరాజు, రాజశేఖర్ పాల్గొన్నారు.

25న బలిజపల్లిలో అశ్వర్ధ నారాయణ కల్యాణం

ప్రజాశక్తి-రాజంపేట

ఈ నెల 25వ తేదీన బలిజిపల్లె గంగమ్మ ఆలయం వద్ద గల శ్రీ మానసాదేవి ఆలయంలో ఉదయం 10 గంటలకు నాగదేవతల అభిషేకం, 10.30నుంచి 12 గంటల మధ్య అశ్వర్ధ నారాయణ కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గుగ్గిళ్ళ రెడ్డి కృష్ణ, రెడ్డి ప్రసాద్, రెడ్డి శివ ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణ మహోత్సవం అనంతరం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి విశేషంగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



గౌస్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుడికి సన్మానం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని కుమారుని పల్లె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూ బదిలీపై వెళ్తున్న ఎస్ఎండి గౌస్‌ను పుల్లంపేట ఎస్‌టియు నాయకులు శుక్రవారం స్థానిక ఎంఆర్‌సి భవనంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, వి.సిద్దయ్య మాట్లాడుతూ సంఘంలో ఉపాధ్యక్షుడిగా పని చేస్తూ మండలంలోని అనేకమంది ఉపాధ్యాయులకు ఇ-ఫైలింగ్ తదితర విషయాల్లో విశేష సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బి.నరేంద్రనాథ్, ఆర్థిక కార్యదర్శి ఎం.శివరాంప్రసాద్, ఉపాధ్యాయ వాణి కన్వీనర్ ఎం.శ్రీనివాసులు, ఎస్‌టియు నాయకులు అశోక్ పాల్గొన్నారు.



క్యారమ్స్ పోటీలు ప్రారంభిస్తున్న ఎంపిపి విజయభాస్కర్‌రెడ్డి

సౌత్ ఇండియా లెవెల్ క్యారమ్స్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - నందలూరు

నందలూరు రైల్వే కేంద్రంలోని రైల్వే ఇన్సిట్యూట్‌లోయంగ్ మెన్స్ క్యారమ్స్ అసోసి యేషన్ వారి ఆధ్వర్యంలో సౌత్ ఇండియా లెవెల్ క్యారమ్స్ పోటీలు శుక్రవారం ప్రారంభమ య్యాయి. ఈ పోటీలను ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. మూడు రోజులపాటు జరిగే పోటీలలో కర్ణాటక, తమిళనాడు, కేరళ, రాష్ట్రానికి చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడాకా రులకు మూడు రోజులపాటు భోజన సదుపాయాన్ని కల్పిస్తున్నారు. కార్యక్రమంలో యంగ్ మెన్స్ క్యారమ్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.ఎన్.శంకర్, సభ్యులు ఆర్ముగం విశ్వనాధ్, పల్లె గ్రీస్మంత్‌రెడ్డి,శ్యామ్‌రాజ్, నాగభూషణం, శివకోటి, గురుప్రసాద్, జంగం శెట్టి హరిప్రసాద్, ముమ్మడిశెట్టి సుధాకర్‌పాల్గొన్నారు.

నూతన బెస్త సంఘాల ఏర్పాటుకు కృషి చేయండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జిల్లాలో నూతన బెస్త సంఘాలు ఏర్పాటు చేయాలని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జగన్ మోహన్ రాజుకి రాజంపేట పార్లమెంట్ బెస్త సాధికార కమిటీ జిల్లా అధ్యక్షులు ముంబై దుర్గా వినతిపత్రం అందజేశారు. శుక్రవారం మదనపల్లి పర్యటనకు వచ్చిన అయనను ముంబై దుర్గ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్లారు. బెస్త సామాజిక వర్గాన్ని అన్నిరకాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని, బెస్త కార్పొరేషన్ ద్వారా విరివిగా రుణాలు, సబ్సిడీ పనిముట్లు అందజేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బెస్త సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు సాధికార కమిటీ కూర్పులో జిల్లా కమిటీలో విధేయతకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. మదనపల్లె నియోజకవర్గంతోపాటు జిల్లా వ్యాప్తంగా తన పరిధిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకు వెళ్లడంతో పాటు, పార్టీ బలోపేతం చేయడానికి కృషి చేస్తానని జగన్ మోహన్ రాజు భరోసానిచ్చారు.

విద్యుత్ ఉద్యోగుల ఉదారత

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అన్నమయ్య విద్యుత్ ఉద్యోగుల సామాజిక సేవా సంఘం కమిటీ సభ్యులు చైతన్య స్వచ్ఛంద సంస్థను శుక్రవారం సందర్శించి చేయూత అందించారు. సంస్థలో ఆశ్రయం పొందుతున్న విద్యార్థులు, వృద్ధుల సంక్షేమం కోసం కమిటీ తరపున రూ.30వేలు విలువగల నిత్యావసర ముడి సరుకులు, రూ.35 వేలు నగదు అందించారు. కార్యక్రమం లో పీలేరు ఎస్ఇ చంద్రశేఖరరెడ్డి, మదనపల్లెఇఇ గంగాధర,డిఇ,ఎఇ,ఎఎఇ,జెఎఇ, ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి

వైద్య కళాశాలల ప్రయివేటీకరణ ఆపాలి

- పోస్టర్ల ఆవిష్కరణలో వైసిపి నాయకులు



మదనపల్లి : కోటి సంతకాల సేకరణ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

మెడికల్ కాలేజీల పిపిపి విధానానికి వ్యతిరేకంగా రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుట్టి, కూటమి ప్రభుత్వాన్ని దోషిగా నిలబెడుతామని మదనపల్లె వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో కోటి సంతకాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిశీలకులు అనూష రెడ్డి, వైసిపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు గుండ్లూరి షమీమ్ అస్లాం ముఖ్య అతిథిలుగా విచ్చేశారు. ఈ సందర్భంగా నిస్సార్ మాట్లాడుతూ రాష్ట్రంలో గత వందేళ్లలో 12 మెడికల్ కాలేజీ లే ఉంటే, జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో 17 మెడికల్ కాలేజీలను తీసుకొచ్చి, వాటిలో ఐదు పూర్తి చేశారన్నారు. చంద్రబాబునాయుడు సిఎం ఆయిన తరువాత మెడికల్ కాలేజీలను తన అను చరులకు పిపిపిలో ఇచ్చి ప్రైవేటు పరం చేశారని ఆరోపించారు. డబ్బు ఖర్చు పెట్టి ప్రైవేట్ ఆస్ప త్రులకు పోవాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన వైఖరి మార్చుకుని, పిపిపి విధానానికి స్వస్తి పలకాలని సూచించారు. పిపిపి విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ నవంబర్ 25న జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో గవర్నర్‌కు కోటి సంతకాలను అందిస్తామని తెలిపారు. మేధావి వర్గాలు, ప్రజాసంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు సంతకాల సేకరణలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. **రాజంపేట :** స్థానిక పార్టీ కార్యాలయంలో వైసిపి నాయకులు కోటి సంతకాల పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ మాజీ సిఎం వైఎస్ .జగన్ ఆదేశాల మేరకు నియోజకవర్గ ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి సూచనలతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ నెల 17 నుండి జగన్మోహన్ రెడ్డి వైద్య కళాశాలలో బోధన ఆసుపత్రుల సందర్శన యజ్ఞానికి శ్రీకారం చుట్టారని, వందేళ్లలో కేవలం 12 వైద్య కళాశాలలు మాత్రమే ఉండగా గత వైసిపి పాలనలో కేవలం ఐదేళ్లలో 17 వైద్య కళాశాలలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. పులివెందుల వైద్య కళాశాలపై చంద్రబాబు కక్షపెంచుకున్నారని, పిపిపి విధానంతో తన మనుషులకు న్యాయం చేయాలని దురాలోచనతో వ్యవహరిస్తున్నాడని విమర్శించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, వైసిపి రాష్ట్ర ప్రధాన కమిటీ ప్రధాన కార్యదర్శి డీలర్ సుబ్బరామిరెడ్డి, ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దండు గోపి, జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి శ్రీవాణి, కౌన్సిలర్ సనిశెట్టి నవీన్, జిల్లా కార్యదర్శి రమేష్ నాయుడు, దాసరి పెంచలయ్య పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** మండల పరిధిలోని తిమ్మిశెట్టిపల్లి గ్రామంలో రచ్చబండ కార్యక్రమం అనంతరం వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి కార్యకర్తలు, గ్రామస్తులతో కలిసి గ్రామంలో పర్యటించారు. పలువురు వికలాంగులకు అనారోగ్యంతో బాధపడుతున్న వాళ్ళకి,అర్హులైన కూడా పెన్షన్ తీసి వేశారని వాపోయారు వారి కష్టాలను చూసి వారు పలువురికి ఆర్థిక సాయాన్ని అందజేసి అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా అర్హులైన అందరికీ పెన్షన్ ఇప్పిస్తామని హామీఇచ్చారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు చెవ్వు శ్రీనివాసులు రెడ్డి,గుత్తి రెడ్డి హరినాథ్ రెడ్డి, ఎంపిపి బాబుల్ రెడ్డి, పంజం వేణుగోపాల్‌రెడ్డి, జడ్‌పిటిసి రత్నమ్మ, ఎంపిటిసిలు జనార్ధనరాజు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి ఆదేశాల మేరకు కురబలకోట మండల వైసిపి అధ్యక్షులు జి.మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రభుత్వ మెడికల్ కాలేజీల పిపిపి విధానానికి వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జడ్పిటిసి బైసాని జ్యోతి చంద్రశేఖర్ రెడ్డి,ఎంపిపి భూదేవి, వైస్ ఎంపిపి రమణారెడ్డి, కాన్స్టెన్సీ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులు ఎంపిటిసిలు ఆనందరెడ్డి, త్రివేణి, గోపాల్‌రెడ్డి, సరస్వతి,మండల కో-ఆప్షన్ నెంబర్ యాసానుల్లా,సర్పంచ్ నాగరత్న ఈశ్వర్, వైసిపి మండల రైతు విభాగ అధ్యక్షులు సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి : సిఐ



మాట్లాడుతున్న సిఐ సత్యనారాయణ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

నిమ్మనపల్లె పోలీసుస్టేషన్‌కు ట్రైనింగ్ నిమిత్తం పిఎస్ఐగా వచ్చిన బి.శ్రీప్రియ మదనపల్లి రూరల్ సర్కిల్ సిఐ సత్యనారాయణను, ఎస్ఐ తిప్పేస్వామి ని కలసి రిపోర్ట్ చేశారు. శుక్రవారం పోలీసు స్టేషన్‌ను సిఐ సందర్శించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పలు రకాల సమస్యలతో పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు చట్ట ప్రకారం న్యాయం చేయాలని సూచించారు. పోలీసులు ప్రజలతో స్నేహపూర్వకంగా ఉంటూ ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై గట్టి నిఘాను ఏర్పాటు చేయాలని, వాటిని పూర్తిగా అణచి వేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. రాత్రి వేళల్లో పోలీసులు గస్తీలు నిర్వహించి చోరీలను అరికట్టాలన్నారు. రోడ్డు భద్రతా చర్యలను చేపట్టాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో నేరాలకు పాల్పడిన వారిపై ప్రత్యేక నిఘ ఉంచాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి చోరీలను ఛేదించాలన్నారు. కోడి పందాలు, జూదం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వంటి కార్యక్రమాలపై డ్రోన్ సహాయంతో ఉక్కు పాదం మోపాలన్నారు.

నీటికోసం ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నగర పంచాయతీ పరిధిలోని బెంగళూరు రోడ్డు,బాబా టాకీస్ వీధికి గత 45 రోజుల నుండి తాగునీరు రాకపోవడంతో శుక్రవారం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. మహిళలు రోడ్డుపై నిరసన చేపట్టడంతో పట్టణంలో ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలుసుకున్న సీఐ గోపాల్ రెడ్డి సంఘటనా స్థలం వద్దకు వచ్చి మహిళలతో మాట్లాడి ఈ విషయమై నగర పంచాయతీ అధికారులతో మాట్లాడారు. రెండు మోటర్లు చెడిపోవడంతో నీటి సమస్య తలెత్తిందని తక్షణమే పరిష్కరిస్తామని తెలిపారు. పేరుకే బి.కొత్తకోట నగర పంచాయతీ అని,మోటర్లు రిపేర్ చేయించడానికి కూడా నిధులు లేకపోవడంతో ఆలస్యమయినట్లు తెలిసింది. ఈ సందర్భంగా స్థానిక మహిళలు మాట్లాడుతూ ఇంటి పన్నులు ఆరు నెలలకు ఒకసారి చెల్లించాలని డిమాండ్ నోటీసులు ఇస్తారని సమస్యల పరిష్కారంలో శ్రద్ధ వహించడం లేదన్నారు. గత 45రోజులుగా తాగునీరు రావడం లేదని, అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నగర పంచాయతీకి అభివృద్ధికి మాత్రం నిధులు లేవా అని ప్రశ్నించారు. ఇకనైనా ఉన్న తాధికారులు నగర పంచాయతీ అభివృద్ధికి నిధులైనా కేటాయించాలని లేకుంటే పంచా యతీగా మార్చాలన్నారు. మోటర్లకు మరమ్మతులు చేయించి నీటి సమస్యలను పరిష్కరించాలని కోరారు.



రోడ్డుపై ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

మదనపల్లె డివిజన్ క్రీడల్లో కలికిరి విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-కలికిరి



డివిజన్‌స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులు మహేష్, హాసిని

మదనపల్లె జడ్‌పి హైస్కూల్‌లో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మదనపల్లె డివిజన్ స్థాయి క్రీడా పోటీలు ఘనంగా జరిగాయి. ఈ పోటీలలో కలికిరి పట్టణం ఇందిరమ్మ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఈ క్రీడల్లో 10వ తరగతి విద్యార్థి డి.మహేష్ సీనియర్ బాయ్స్ విభాగంలో హైజంప్‌లో అద్భుత ప్రదర్శన కనబరచి మొదటి స్థానం సాధించాడు. జూనియర్ మహిళల విభాగంలో హాసిని 100 మీటర్లు, 200 మీటర్ల పరుగు పందెంలో సత్తా చాటుతూ రెండు విభాగాల్లోనూ మొదటి స్థానాలను కైవసం చేసుకున్నారు. ఇద్దరు విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికై, పాఠశాలకు గౌరవం తెచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు రమేష్‌రెడ్డి మాట్లా డుతూ మా విద్యార్థులు క్రీడా రంగంలో అద్భుత ప్రతిభ కనబరచడం ఆనందదాయకమని, వారికి మరింత ప్రోత్సాహం అందించి, రాష్ట్ర స్థాయిలోనూ విజయాలు సాధించేలా మార్గనిర్దేశం చేస్తామన్నారు. విజేతల విజయానికి కృషి చేసిన ఫిజికల్ డైరెక్టర్ రెడ్డి మోహన్ రెడ్డిని అభినందించారు. మోహన్ రెడ్డి శిక్షణ, మార్గనిర్దేశం వల్లే విద్యార్థులు ఈ స్థాయి విజయాలు సాధిస్తున్నారు అని పేర్కొన్నారు. విద్యార్థుల విజయంపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, జిల్లా స్థాయి పోటీల్లో కూడా విజయం సాధించాలని ఆకాంక్షించారు.

అట్టహాసంగా అథ్లెటిక్స్ పోటీలు

పుల్లంపేట : మండల కేంద్రంలోని ఎస్‌బివిడి సభ క్రీడా ప్రాంగణంలో మండల స్థాయి అథ్లెటిక్స్ పోటీలను ఎంఇఒ చక్రధర్‌రాజు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ లీలాశ్రీహరి ప్రారంభించారు. ఈ పోటీల్లో మండల వ్యాప్తంగా దాదాపు 200మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. మండల స్థాయి క్రీడా పోటీల్లో పలువురు విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ సాయిరాం తెలిపారు. కార్యక్రమంలో పీడీ నీలకంఠరావు, కనకదుర్గమ్మ, మయూరి, జయలక్ష్మి పాల్గొన్నారు.



షార్ట్‌పుట్ విసురుతున్న విద్యార్థిని



మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ షేక్ రుఖయాబేగం

ఆడబిడ్డల సంరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి-పీలేరు

ఆడబిడ్డల సంరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ షేక్ రుఖయాబేగం తెలిపారు. పీలేరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ రాజమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక గ్రామ పంచాయితీ కార్యాలయంలో పోషణ్ మా ఉత్సవ్ కార్యక్రమం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ షేక్ రుకియా బేగం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడపిల్లల సంరక్షణ, బాల్యవివాహాల నిర్మూలన, తల్లీబిడ్డల్లో పోషకాహార సమతుల్యత నిర్వహణ కార్యక్రమాలను అంగన్వాడీ కేంద్రాల ద్వారా సక్రమంగా జరుగుతున్నాయన్న సంతృప్తిని వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆడపిల్లల సంరక్షణ బాధ్యత తల్లిదండ్రులపై ఉంటుందని తెలిపారు. సిడిపిఒ రాజమ్మ మాట్లాడుతూ పౌష్టికాహారం సక్రమంగా తీసుకోవడం వల్ల గర్భిణులు, బాలింతల్లో అనీమియా శాతం చాలా తగ్గిందని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే బాలసంజీవిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి రెండవ శనివారం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించబడుతుందని, ప్రతి బిడ్డకూ సకాలంలో టీకాలు వేయించుకోవాలని సూచించారు. డిప్యూటీ హెచ్ఇ కొండయ్య మాట్లాడుతూ టీకాలు, సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రత, బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. పట్టణ అర్బన్ సిఐ యుగంధర్ మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు తల్లిదండ్రులపై ఆధారపడి ఉంటుందని, కాబట్టి తల్లిదండ్రులుగా తమ పిల్లల్ని సక్రమమైన మార్గంలో పెంచాల్సిన బాధ్యత ఉందన్నారు. సూపర్వైజర్ స్వరూప మాట్లాడుతూ పోషకాహార విలువలను వాటిలోని విటమిన్స్, సీజనల్ ఫ్రూట్స్ గురించి అక్కడ నిర్వహించిన స్టాల్స్ లో ఏ ఫుడ్ లో ఏమున్నాయని తెలియజేసి అనీమియా లేని తల్లుల భవిష్యత్తుకి మనం అందించాలని, ఇది మన అందరి బాధ్యని తెలిపారు. సమావేశంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు స్వరూప, స్వర్ణ, ఉమాదేవి, భారతి, యశోద, శాంత, అన్నపూర్ణ, అక్కయ్యమ్మ, శంకరమ్మ, జిల్లా, వన్ స్టాప్ సెంటర్ నుంచి ప్రశాంతి, జిఎంఎస్ కేస్, అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.



రోడ్డు మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

మోడల్ స్కూల్ రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలోని మోడల్ స్కూల్ రోడ్డుకు మరమ్మతు పనులు చేపడుతున్నట్లు ఎంపి డిఒ రమేష్‌బాబు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా స్కూలుకు వెళ్లే మట్టి రోడ్డు కోత లకు గురై పూర్తిగా దెబ్బతినిందని విద్యార్థుల సౌకర్యార్థం ఆ రోడ్డును పునరుద్ధరించాలని పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ జ్ఞానావతి ఎంపిడిఒ దృష్టికి తీసుకు వచ్చిందన్నారు. విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి ఎంపిడిఒ మోడల్ స్కూల్ మట్టి రోడ్డుకు కాంట్రాక్టర్ శ్రీనివాసులు రెడ్డికి ద్వారా మరమత్తు పనులను ప్రారంభించారు. శుక్రవారం రోడ్డు మరమ్మతు పనులను పాఠశాల ప్రిన్సిపల్‌తో కలిసి ఎంపిడిఒ పరిశీలించారు. కాంట్రాక్టర్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి

గ్రామ అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని పుల్లంపేట గ్రామంలో సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి ఆధ్వ ర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని శివాలయంవీధి భావన ఋషి గుడి, బెస్తవీధి, దర్గా వీధి మొదలగు వీధులలో పిచ్చి మొక్కలు తొలగించి సున్నం, బ్లీచింగ్ చల్లించారు. గ్రామ తాగునీటి మోటర్ పరిసర ప్రాంతాల్లో వద్ద పిచ్చి మొక్కలను తొలగింపజేశారు. భావన ఋ షి గుడి దగ్గర నీరు అధికంగా నిల్వ ఉందని దానిని పరిష్కరించాలని గ్రామస్తులు ఎంపి డిఒను కోరడంతో తగు చర్యలు వెంటనే చేపట్టడం జరుగుతుందని గ్రామ ప్రజలకు తెలిపారు. ప్రజలు కూడా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.సీజనల్ వ్యాధులు ప్రబల కుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్ర మంలో ఎంపిడిఒ జయశ్రీ, పంచాయతీ కార్యదర్శి ముత్తయ్య, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

పిపిపి విధానంపై ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న వైసిపి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సిఎం చంద్రబాబు పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకు పోతోందని, పిపిపి విధానంపై వైసిపి నాయకులు రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని టిడిపి జిల్లా అధ్యక్షుడు, రాజంపేట టిడిపి ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్‌రాజు, రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్.జె వెంకటేష్ విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రెండు రోజుల కిందట జగన్మోహన్ రెడ్డి ఉత్తరాంధ్రలోని నర్సీపట్నంలో మెడికల్ కళాశాలను సందర్శించారన్నారు. కేవలం రాజకీయ దురుద్దేశంతోనే మెడికల్ కళాశాలల పేరుతో వై.ఎస్.జగన్ రాజకీయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. పబ్లిక్- ప్రయివేట్- పార్టనర్ షిప్ విధానం ద్వారా వేగవంతంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ఉత్తరప్రదేశ్, ఒడిస్సా, చత్తీస్ గడ్, కర్ణాటక రాష్ట్రంలో మెడికల్ కళాశాలలో ఎంతో పురోగతి సాధించాయన్నారు. వైసిపి ప్రభుత్వంలో 17 కళాశాలలు మంజూరైతే, ఇందులో కేవలం పాడేరు, పులివెందుల మెడికల్ కళాశాలలను మాత్రమే పూర్తి చేశారన్నారు. మిగిలిన 15 కళాశాలలు అసంపూర్తిగానే మిగిలాయని, ఈ కళాశాలలు 20 ఏళ్లు అయినా పూర్తిగాని పరిస్థితి ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం పిపిపి విధానంలో 500 బెడ్స్ ఏర్పాటు చేసి ఆసుపత్రులను నడిపేలా ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. పిపిపి విధానం వల్ల ప్రభుత్వం అజమాయిషీ ఉంటుందని, మెడిసిన్ చదివే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రజలు జగన్నాటకాలను గమనిస్తున్నారని, వైసిపి దుష్ప్రచారాలను నమ్మరన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి రాటకొండ మధుబాబు, బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ జోళపాళ్యం దేవేంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

క్రైం కార్నర్



యువకుడి బావిలోంచి బయటకు తీసుకొస్తున్న కానిస్టేబుల్ అమర

యువకుడి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్

- కౌన్సెలింగ్ ఇచ్చి బంధువులకు అప్పగింత

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లెకు వచ్చి బావిలో దూకి ఆత్మహత్యకు యత్నించిన బెంగళూరు యువకుడి కానిస్టేబుల్ అమర చాకచక్యంగా కాపాడి ప్రాణాలు నిలబెట్టి పునర్జన్మను ఇచ్చారు. వివరాల్లోకి వెళితే..బెంగళూరుకు చెందిన చెంగాచారి, శశి దంపతులు కుమా రుడితో కలసి సాయంత్రం మదనపల్లెలోని లోని ఓ ప్రముఖ ఆలయానికి వచ్చారు. బాగా పొద్దుపోవడంతో రాత్రి తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో భార్యా భర్తలు గొడవ పడ్డారు. భార్య శశి గొడవపడిందని మనస్తాపం చెందిన చెంగాచారి చేతి నరాలు కోసుకొని, స్థానిక మడికయిల శివాలయానికి సమీపంలో ఉన్న కోడిగుడ్డు బావిలో దూకి ఆత్మహత్యకు యత్నించాడు. బావిలో ఉన్న చెట్ల కొమ్మలను పట్టుకుని రాత్రంతా కేకలు వేస్తూ.. కాపా డమని అరిచాడు. శుక్రవారం అటుగా వెళుతున్న పాదచారులు గుర్తించారు. అదే సమ యంలో తన పిల్లలను స్కూలుకు బైకులో తోడుకుని వెళుతున్న మదనపల్లి రూరల్ సర్కిల్ సిఐ సత్యనారాయణ డ్రైవర్ అమర గుర్తించి వెంటనే రోపు సాయంతో బావిలోకి దిగి చెంగాచారిని వెలికి తీసి కాపాడి శభాష్ పోలీస్ అమర అంటూ స్థానికుల దగ్గర ప్రశంసలు అందుకున్నారు.